క్లుప్తంగా

అధికార యంత్రాంగం ప్రొటోకాల్ పాటించాలి

అంబర్‌పేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో అధికార యంత్రాంగం ప్రొటోకాల్ పాటించాలని గోల్నాక డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ఓ ప్రకటనలో సూచించారు. నియోజకవర్గంలో జరిగే అధికార కార్యక్రమాల్లో కార్పొరేటర్లకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమాల్లో సైతం తమ ఫోటోలను ఫ్లెక్సీల్లో పొందుపరచకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా దశాబ్ది ఉత్సవాల్లో ప్రొటోకాల్ వివాదానికి తావులేకుండా అధికారులు వ్యవహరించాలని ఆమె కోరారు.

మహిళా ఉద్యోగులకు సత్కారం



మాజీ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య కన్నా

కాచిగూడ: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కాచిగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలను మాజీ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య కన్నా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం జీహెచ్ఎంసీ, పోలీస్, జలమండలి, విద్యుత్ తదితర ప్రభుత్వ విభాగాల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని ఘనంగా సత్కరించి అభినందించారు. వారి సేవలను కొనియాడుతూ.. బహుమతులను అందజేశారు. బీఆర్ఎస్ నేతలు ఎక్కాల కన్నా, అశోక్‌రెడ్డి, అశోక్ కాక, శివరాజ్, సాగర్, వంశీ, కొండయ్య, నర్సింగ్‌రావు, రియాజ్, శ్రీధర్, గోపాల్, అంజమ్మ, సునీత, లక్ష్మి తదితరులున్నారు.

నిట్టల కిరణ్మయికి అవార్డు ప్రదానం



అవార్డు ప్రదానం చేస్తున్న ఆచార్య ఎన్.గోపి తదితరులు

చిక్కడపల్లి: సాంస్కృతిక సంస్థ అభినందన ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో మాతృవందనం పేరిట మాదిరాజు వరలక్ష్మి స్మారక అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య ఎన్.గోపి ముఖ్యఅతిథిగా హాజరై ఆధ్యాత్మికవేత్త, సౌందర్యలహరి ప్రవచనకర్త నిట్టల కిర ణ్మయికి అవార్డును ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మి, డా. భవానీ, ఇందిరాలక్ష్మి, లలిత, శారద, శోభ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ పేర్కొన్నారు. చిక్కడపల్లి బాపునగర్ బస్తీలో కొనసాగుతున్న షాబాద్ స్టోన్ ఫ్లోరింగ్ పనులను మంగళవారం ఆమె జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ.. బస్తీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను పూర్తిచేసి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బాపూనగర్, వాల్మీకినగర్, అరుంధతినగర్, సబర్మతీనగర్, వీవీ గిరినగర్ బస్తీల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. వినయ్‌కుమార్, దామోదర్, రాజేందర్, బస్తీవాసులు శోభ, సరిత, కోటేశ్వరి, రేణుక పాల్గొన్నారు.

బీసీ జనగణన చేయాలి

లిబర్టీ: ఒడిశా, బిహార్, తమిళనాడు రాష్ట్రాలను స్ఫూర్తిగా తీసుకొని బీసీ జనగణ చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా రాష్ట్రాలు బీసీ గణనకు పూనుకున్నాయని బీసీ గర్జన చేసేందుకు ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా రాష్ట్రాలను స్ఫూర్తిగా తీసుకోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా జనగణన చూపించాలని లేనిపక్షంలో బీజేపీపై యుద్ధం ప్రకటించి తిరుగుబాటు పోరాటాలు చేసి మిషన్ 2024 లక్ష్యంగా గద్దదింపుతామని హెచ్చరించారు.

'ప్రజల సంక్షేమానికి విప్లవాత్మక పథకాలు'



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళ, శిశు సంక్షేమానికి విప్లవాత్మక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్లో తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆడబిడ్డలకు అండగా నిలిచారని స్త్రీ సాధికారతకు పెద్దపీట వేస్తూ.. వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను రూపొందించారని వివరించారు. మహిళలు, పిల్లల పోషణకు రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలను కొనసాగిస్తుందన్నారు. మహిళాసాధికార బలంగా షిటీమ్స్ నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. యువజన విభాగం నాయకుడు ముఠాజైసింహ, నోడల్ ఆఫీసర్ పవన్‌కుమార్, జీహెచ్ఎంసీ డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ఏఎంఒహెచ్ మైత్రేయి, ముషీరాబాద్ మండల్ డిప్యూటీ తహసీల్దార్ చందన, డీపీఓ సుధాకర్, వైద్యాధికారి డాక్టర్ అవంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కవిత, జ్యోతి, మాజీ కార్పొరేటర్ ముఠాపద్మ, పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేష్, ముచ్చుకుర్తి ప్రభాకర్, జీహెచ్ఎంసీ అధికారులు మధు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి..

ముషీరాబాద్: 18 ఏళ్లు పైబడిన యువతీయువకులందరూ ఓటరులిస్టులో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాంనగర్ డివిజన్ న్యూ అచ్చయ్యనగర్‌లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ అధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ తదితరులు హాజరై ఓటరు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రజాస్వామ్యంలో ఓటే సామాన్యుడి ఆయుధమని మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ఇదే మంచి తరుణమన్నారు. డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, ముదిగొండ మురళీ, ప్రవీణ్‌ముదిరాజ్, శ్రావణ్, కిషన్‌రావు, రాజు, నాగభుషణం, శివకుమార్‌యాదవ్, కళ్యాణనాయక్, శ్రీనివాస్, మున్నానాయక్, సునీల్, అరవింద్, వాసుదేవ్, విజయకృష్ణ, రాజేష్, మోయిస్, రాజేందర్ తదితరులున్నారు.

పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న పోతుల నారాయణరెడ్డి

చిక్కడపల్లి: పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈపీఎస్ పెన్షనర్లకు కనీసం రూ.900 చెల్లించాలన్నారు. హయ్యర్ పెన్షన్ ఆప్షన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నూతన వేతన సవరణ కమిషన్‌ను నియమించాలన్నారు. ఆరోగ్యకార్డుతో అన్ని ఆసుపత్రుల్లో నగదురహిత వైద్యం అందించాలన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు రంగయ్య, ఎం.జనార్దన్‌రెడ్డి, నరహరి, వైకుంఠరావు, ఎల్.అరుణ, వీరన్న, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

చిక్కడపల్లి: పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్ ఎస్ఆర్‌టీ కాలనీకి చెందిన పుర్రె స్వర్ణలత కుమారుడు విలియమ్(19) నారాయణగూడలోని నవచైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కాగా గత నెల 7న చర్చికి వెళ్తున్న తన సోదరితో చర్చికి వెళ్లి తర్వాత వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తన స్నేహితుడితో పరీక్షల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నానని వరంగల్‌కు వెళ్తానని చెప్పినట్లు సమాచారం. ఆచూకీ ఇప్పటి వరకు లభించకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లకుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలైన ఆరోగ్యశ్రీ ట్రస్ట్, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) పథకాన్ని అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రజలకు సూచించారు. మంగళవారం నల్లకుంట సత్యానగర్, రత్నానగర్‌లలో చేపట్టిన హెల్త్‌కార్డులకు పేర్ల నమోదు ప్రక్రియను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హెల్త్‌కార్డుల నమోదుకు అవసరమైన అందరి ఫీజును తానే భరిస్తానని స్పష్టం చేశారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఈ పథకానికి అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బస్తీపెద్దలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం



కార్మికులను శాలువాతో సత్కరిస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలో ఘనంగా తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, కార్మిక నాయకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఎస్ఎఫ్ఏలను సత్కరించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నేత శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లేష్, వెంకటేశ్వర్‌రావు, సిరిగిరి శ్యామ్, కిరణ్, కార్తీక్‌యాదవ్, సిద్దిఖ్, శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకటేష్, అజ్జు, వంశీ, సాయియాదవ్, శ్రీనాథ్, సాయి, రాహుల్, ప్రభాకర్, ప్రేమలతరెడ్డి, మంగ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 9న దేశవ్యాప్తంగా మహాధర్నాలు

హిమాయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక చర్యలకు నిరసనగా దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాలలో ఆగస్టు 9న 'మహాపడావ్' (మహాధర్నాలు) నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ వెల్లడించారు. క్విట్ ఇండియా రోజున జరిగే ఈ కార్యక్రమంలో 'సేవ్ నేషన్.. సేవ్ పీపుల్' నినాదంతో నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆగస్టు 15 తరువాత జరిగే కేంద్ర కార్మిక, రైతు సంఘాల సంయుక్త సమావేశంలో వ్యవసాయ, కార్మిక సమస్యలపై ఐక్య ఉద్యమ కార్యాచరణను రూపొందించి, డిసెంబర్‌లో జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ప్రకటించారు. వ్యవసాయ, కార్మిక హక్కుల పరిరక్షణ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరును క్షేత్రస్థాయిలో ఎండగట్టేందుకు మహాపడావ్ నిర్వహించాలని జాతీయ సదస్సులో 14 కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయని తెలిపారు. 'ఢిల్లీ రైతు'ల ఉద్యమానికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నవంబర్ 26,27,28న రైతు సంఘాలు చేపట్టే కార్యక్రమానికి కేంద్ర కార్మిక సంఘాలు భాగస్వామ్యం అవుతాయన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక కోర్డ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకూడదని తెలంగాణ సీఎం కేసీఆర్ అమర్ కౌర్ కోరారు.

పనులను సకాలంలో పూర్తి చేయాలి



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం డివిజన్‌లోని వినాయక్‌నగర్, రహత్‌నగర్ ప్రాంతాల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. వర్షకాలం రావడంతో పనుల్లో ఇబ్బందులు తలెత్తుతాయని తగిన జాగ్రత్తలు తీసుకుని రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ప్రజా అవసరాల కోసం లక్షలాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధిపనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు రుణాలు ఇవ్వాలి

నల్లకుంట: బీసీ కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులందరికీ రుణాలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం మంగళవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకు మాత్రమే బీసీ కార్పొరేషన్ ఉందని గత 8 ఏళ్లగా బీసీ కార్పొరేషన్, కుల ఫెడరేషన్లకు రుణాలు ఇవ్వడం లేదని, పాలకవర్గాన్ని కూడా నియమించడం లేదని ఆరోపించారు. రాష్ట్ర సాధనకు ఎంతో మంది బీసీ బిడ్డలు ఉద్యమించి అమరులయ్యారన్నారు. మరికొందరు జైలు జీవితాన్ని అనుభవిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రుణాల కోసం 2015–16లో బీసీ కార్పొరేషన్‌లో దరఖాస్తు చేసుకున్న బీసీలకు నేటికి రుణాలు మంజూరు చేయక పోవడం దారుణమన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందు బీసీ యువతకు సబ్సిడీ రుణాలు ఇచ్చేవారని రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎన్నికల సమయంలోనే బీసీ రుణాలంటూ.. యువతను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన ఎంబీసీ వేయి కోట్ల నిధులు కాగితాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సబ్సిడీ రుణాలు అందివ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బీసీ రుణాల దరఖాస్తుదారులకు రుణాలను మంజూరు చేయాలని లేని పక్షంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని సత్యం హెచ్చరించారు.

హిందువులంతా సంఘటితం కావాలి

వీహెచ్‌పీ సమావేశంలో స్వామీజీల పిలుపు



స్వామీజీలు సంగ్రామ మహారాజ్, యోగానంద సరస్వతి, కమలానంద భారతి తదితరులు

కాచిగూడ: హిందూ సమాజంపై దుర్మార్గమైన దాడి జరుగుతోందని సాదు సంతులు ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక రుగ్మతల ఆధారంగా.. నిరక్షరాస్యత, పేదరికం కారణంగా మతమార్పిడి మహమ్మారి హిందుత్వంపై భీకరమైన దాడి చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు మఠాలు, పీఠాల సాధువులు, సంతులు ప్రముఖులతో సమావేశం నిర్వహించింది. కాచిగూడలోని శ్రీ శ్యామ్‌మందిర్ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో తెల ంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు 110 మంది ప్రముఖ స్వామీజీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాధువులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్వామీజీలు అందరూ.. హిందూ ఖ్యత కోసం కట్టుబడి పనిచేయాలని ప్రతిన భూనారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మాణాలు చేశారు. మతమార్పిడిని తీవ్రంగా ప్రతిఘటించడం, ఆదర్శ హిందూ కుటుంబ జీవనాన్ని ప్రోత్సహించడం, ప్రతి దే వాలయం హిందువులకు కేంద్రంగా చేయడం, ప్రభు త్వ ఆధీనంలోని దేవాలయాలను హిందువులకు అ ప్పగించడం, గ్రామీణ ప్రాంతాల్లో సాధుసంతులు వి రివిగా పర్యటన చేసి హిందూ బంధువులకు భరోసానింపడం, ప్రతి హిందువుకు హనుమాన్ చాలీసాపై అవగాహన పెంచి, హనుమాన్ చాలీసా పారాయ ణం చేయించాలని తీర్మానించారు. ప్రముఖ స్వామీజీలు మహారాజ్, యోగానంద సరస్వతి, కమలానంద భారతి, దుర్గాప్రసాద్, సోమాయప్ప స్వామి, చైతన్యానంద మహరాజు, విశ్వహిందూ పరిషత్ జాతీ య కార్యదర్శులు రాఘవులు, సత్యంజీ, పుప్పాల వెంకటేశ్వర్‌రావు, రామరాజు, బాలస్వామి, డీఆర్ఎస్ నరేంద్ర, భానుప్రసాద్, యాదిరెడ్డి పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రి గంగులకు వినతిపత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్ గౌడ్

కాచిగూడ: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్రంలోని బీసీ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థి ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఐఐటీ, ఐఐఎం, ఏఐఐఎంఎస్, ఎన్ఐటీ, కేంద్ర విశ్వవిద్యాలయాలు, సంస్థల్లో చదువుతున్న బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, ప్రతి ఏటా మహాత్మజ్యోతిరావు పూలే విదేశీ విద్య నిధి స్లాట్స్ రూ.2500లకు పెంచాలన్నారు. ప్రతి విశ్వవిద్యాలయంలో పూలే పరిశోధన కేంద్రాలను స్థాపించి పీహెచ్‌డీ చేస్తున్న బీసీ విద్యార్థులకు స్పెషల్ ఫెలోషిప్‌లను అందజేయాలని కోరారు. బీసీ యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రతి మండలంలో ప్రవేశపెట్టాలని, ఆటస్థలంతో పాటు బీసీ విద్యార్థులకు శాశ్వత హాస్టల్ భవనాలను నిర్మించి, నెలవారీ అలవెన్సు రూ.2500 అందజేయాలన్నారు. బీసీ పీహెచ్‌డీ విద్యార్థులకు స్పెషల్ డేటా స్కీమ్‌తో పాటు ప్రభుత్వం ఉచితంగా లాప్‌టాప్‌లను అందజేయాలన్నారు. బీసీ యువ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక శిక్షణనిచ్చి టీహబ్ ద్వారా స్టార్టప్‌ల ఏర్పాటుకు అవకాశం కల్పించాలన్నారు. న్.సాయికిరణ్, వెంకటదాస్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయ పనుల పర్యవేక్షణ



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: బర్కత్‌పుర, విక్రంనగర్ పార్కులో నూతనంగా ఏర్పాటు చేయనున్న వార్డు కార్యాలయ పనులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. వార్డు కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా వార్డు కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజా సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు డెన్‌సిల్, రఘు, కార్తీక, నరేష్, రాము బీజేపీనేతలు వాసు, టింకు, భీమ్‌రాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ రెరా చైర్మన్‌కు అభినందన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(టీఎస్‌రెరా) చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ ఎన్.సత్యనారాయణ ఐఏఎస్‌ను ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ మంగళవారం అభినందించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్‌గా బాధ్యతాయుతంగా నిజాయితీ, నిబద్ధతతో పని చేసిన ఆయన రెరా చైర్మన్‌గా నియమించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపామన్నారు. రెరా సభ్యులుగా లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రావును నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు. రేరా చైర్మన్‌గా నియమించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



అభినందిస్తున్న కొండూరు సత్యనారాయణ

అన్ని రంగాల్లో మహిళలకు చేయూత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: మహిళ సాధికారితకు వడ్డీలేని రుణాలు అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మహిళల అభ్యున్నతి, శిశుసంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. మంగళవారం అంబర్‌పేట్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళ సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒంటరి మహిళలకు పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి, పౌష్టికాహారం, కేసీఆర్ కిట్లు, షీటీమ్స్ వంటి అనేక వినూత్న సంక్షమే పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధికారులు వేణుగోపాల్, జోష్న, రజిత, జ్యోతిబాయి, ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రేయలతో పాటు పలువురు బీఆర్ఎస్ మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ. లక్ష ఆర్థికసాయం గడువు పొడిగించాలి



మాట్లాడుతున్న రాజేందర్ పటేల్‌గౌడ్

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తుల వారికి అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయం పథకం గడువును నెలరోజుల పాటు పొడిగించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. లక్ష రూపాయల ఆర్థిక సహాయం అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యంతో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారన్నారు. దీంతో ఎంతో మంది బీసీలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొందని దీంతో మరో నెలరోజుల గడవును పెంచాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అన్ని కులాలకు వర్తింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. బీసీ మహాసభ నేతలు కిషోర్, ప్రదీప్‌గౌడ్, భాస్కర్, రాజేందర్‌కుమార్, సాహూ, ప్రత్యూష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రొ.అన్సారీ దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ప్రొ.అన్సారీ దీక్ష రెండో రోజు కొనసాగింది. మంగళవారం ప్రొ.అన్సారీగా మద్దతుగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించినా ల్యాప్‌టాప్ విషయమై అడుగుతున్నారని ప్రొ.అన్సారీ ఈ సందర్భంగా పే ర్కొన్నారు. చిన్న అంశాన్ని సాకుగా చూపి ప్రిన్సిపాల్ ప్రొ.గణేష్ నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. వీసీ ప్రొ.రవీందర్ తన పై కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే నోడ్యూస్ సర్టిఫికెట్ ఇప్పించి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆమరణ నిరహారదీక్ష చేపడతానని హెచ్చరించారు.

క్రిమినల్ గ్యాంగ్‌పై పీడీయాక్ట్ నమోదు



మహ్మద్ వకార్ మెహిదీ



మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్



సయ్యద్ రఫీక్



షేక్ బషీర్



మహ్మద్ అలీ



సైదా ఉజ్మా ఫాతిమా

ముషీరాబాద్: నగరంలో నిత్యం నేరాలకు పాల్పడుతూ.. పలువురు వ్యాపారస్తులను హనీ ట్రాప్‌కు పాల్పడుతున్న ఆరుగురిపై పీడీయాక్టు నమోదు చేశారు. వీరిలో ఓ మాజీ హోంగార్డుపై కూడా పీడీయాక్టు నమోదు చేసి జైలుకు తరలించారు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో హోంగార్డుగా పనిచేసే మహ్మద్ వకార్‌మెహిదీ దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతూ.. అరెస్టై జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై వచ్చిన తర్వాత కూడా ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నలుగురిని, ఆసీఫ్‌నగర్, సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మరో ఇద్దరిని మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్, సయ్యద్ రఫీక్, షేక్ బషీర్, మహ్మద్ అలీ, సైదా ఉజ్మాఫాతిమాలతో కలిసి క్రిమినల్ గ్యాంగ్‌ను ఏర్పాటు చేశాడు. ఈ గ్యాంగ్‌లో ఓ యువతి కూడా ఉండటం గమనార్హం. ఆమె డబ్బున్న వ్యాపారస్తులు, సమాజంలో పరువు, ప్రతిష్టలు కలిగిన వ్యక్తులను టార్గెట్ చేసుకుని పరిచయాలు పెంచుకుని ఫోటోలు దిగి ఆ ఫోటోలతో బ్లాక్‌మెయిలింగ్ చేస్తూ.. డబ్బులు గుంజే పనిగా ఈ ముఠా ఎంచుకుంది. ఇలా నగరంలో అనేక మందిని హనీట్రాప్ పేరుతో డబ్బులను దండుకున్నారు. తాజాగా ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా ఇలాంటి ఘటననే చోటు చేసుకుంది. వీరిని అరెస్టు చేసి జైలుకు పంపినప్పటికీ బెయిల్‌పై వచ్చి ఇదే పనిని కొనసాగిస్తుండటంతో నగర పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు పీడీయాక్టు నమోదు చేసి జైలుకు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ ప్రకటించారు.